క్లుప్తంగా

చల్లంగా చూడవమ్మా గంగమ్మ తల్లీ !



కారంచేడు: గ్రామ దేవతగా విరాజిల్లుతున్న పోలేరమ్మ తల్లికి ఆదివారం ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి తలంట్లు దగ్గర నుంచి మధ్యాహ్నం అమ్మవారికి పొంగళ్లు, నైవేద్యాల సమర్పణను కన్నుల పండువగా నిర్వహించారు. ఈ ఏడాది వర్షాలు బాగా పడాలని, పంట కాలువలు సాగు నీటితో కళకళలాడాలని, గిట్టుబాటు ధరలను అమ్మవారు కల్పిస్తారని అన్నదాతలు, గ్రామస్తుల ప్రగాఢ విశ్వాసం. భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు ఉన్నత చదువులపై అవగాహన

పర్చూరు (చినగంజాం): మండలంలోని నాగులపాలెం అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఉన్నత చదువులపై నేడు సోమవారం అవగాహన కల్పించనున్నట్లు పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణ మోహన్ తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య ఉపన్యాసకుడిగా రోటరీ అసిస్టెంట్ గవర్నర్ తేళ్ల రమేష్‌చంద్ర, వ్యాఖ్యాతగా పిన్నక సాంబ శివరావు హాజరవుతారని, విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు అద్దంకిలో స్వచ్ఛతా హీ సేవా

అద్దంకి రూరల్: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డి. శరత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా వైద్యశాల ప్రాంగణంలో పురపాలక పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈవైద్య శిబిరానికి పారిశుద్ధ్య కార్మికులు తప్పక హాజరు కావాలని కోరారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు

అద్దంకి: ఎరువులను ప్రభుత్వ నిర్ణయించిన ధరలకంటే అధికంగా విక్రయిస్తే దుకాణదారుల లైసెన్స్ రద్దు చేసి కేసులు నమోదు చేస్తామని మార్టూరు ఏడీఏ కేవీ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం సంతమగులూరు మండలంలోని పుట్టవారిపాలెం గ్రామంలో ఉన్న ఎరువుల దుకాణాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఈపాస్ మిషన్‌లో ఉన్న స్టాక్‌కి గోడౌన్‌లో ఉన్న స్టాక్‌కు వ్యత్యాసాలు ఉండకూడదన్నారు. అవకతవకలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు తప్పవన్నారు. రైతు సేవా కేంద్రాల్లో నాణ్యమైన ఎరువులను ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు.

రాతి ముఖ మండపానికి విరాళం



విరాళాన్ని అందిస్తున్న దాతలు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థాన రాతి ముఖమండప నిర్మాణానికి ఆదివారం నెల్లూరు జిల్లా కలిగిరి మండలం లక్ష్మీపురం కండ్రిగ గ్రామానికి చెందిన చుండూరి వీరయ్య జ్ఞాపకార్థం ఆయన భార్య సుబ్బాయమ్మ, రూ. 1 లక్షను దేవస్థాన అధికారులకు అందజేశారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

యద్దనపూడి: మండలంలోని యనమదల గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నూతలపాటి రత్నంరాజు అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రత్నకుమారి తెలిపారు. మనమదల గ్రామంలోని ఓ ఇంట్లో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందటంతో తనిఖీలు చేశామని, ఈ తనిఖీల్లో మద్యం సీసాలు లభ్యమైనట్లు ఆమె తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తాగొచ్చి కొడుతున్నాడని భర్త, అత్తపై కేసు

అద్దంకి రూరల్: భర్త తాగి వచ్చి కొడుతూ చిత్రహింసలు పెడుతుంటే, అత్త అదనపు కట్నం తెమ్మని వేధిస్తుందని వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉమెన్ ఎస్సై సీహెచ్ ప్రవీణ ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. అద్దంకిలోని రామ్‌నగర్‌కు చెందిన అనూషకు 11 ఏళ్ల క్రితం ఒంగోలు పేర్నమిట్టలో నివాసం ఉంటున్న గోపిశెట్టి అనిల్ కుమార్‌తో వివాహం అయింది. ఈ నేపథ్యంలో భర్త గోపిశెట్టి అనిల్ రోజు మద్యం సేవించి వచ్చి కొడుతూ చిత్రహింసలు పెడుతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని అత్త గోపిశెట్టి రమణమ్మకు చెప్పినా వినిపించుకోకుండా అదనపు కట్నం తేవాలని వేధిస్తుందని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నిద్రలో నిఘా.. దర్జాగా జూదం

- జిల్లా, మండల సరిహద్దు ప్రాంతాల్లో యథేచ్ఛగా పేకాట
- చిత్తవుతున్న యువత– పత్తా లేని పోలీసులు
- చిన్నాభిన్నమవుతున్న కుటుంబాలు
- మామూళ్లు తీసుకొని వదిలేస్తున్న వైనం



యద్దనపూడి: కూటమి ప్రభుత్వంలో పేకాట క్లబ్బులు విరాజిల్లుతున్నాయి. టీడీపీ, జనసేన నాయకులు దగ్గరుండి పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారని బహిరంగ సమాచారం. తాగితే మత్తు ఎక్కుతుంది. కాస్త సమయం దాటితే కిక్కు దిగుతుంది. కానీ పేకముక్క చేతిలో ఉంటే జూదానికి బానిసలైతే ఈ ఆట కాకపోతే మరో ఆట. అదీ కాకపోతే రేపు, ఎల్లుండి ఇలా ఎన్ని రోజులైనా ఆటకొట్టి తీరాల్సిందే. ఎలాగైనా పోయిన డబ్బులు రాబట్టుకోవాలనే వ్యసనంతో ఇంటి బాధ్యతలు పూర్తిగా విస్మరించి ఎంతోమంది జూదరులు చేలవెంట, గట్ల వెంట పేకముక్కలు పట్టుకొని పరుగులు తీసున్నారు. పేకాటలో సర్వం కోల్పోయి ఇంటాబయట అప్పులు చేసి అప్పుల ఊబిలో ఇరుక్కుపోతున్నారు.

పర్చూరు నియోజకవర్గంలో 30 గ్రామాలకు పైగా రహస్య ప్రదేశాల్లో పేకాట మూడుముక్కలు ఆరు కోతలుగా నడుస్తోంది. పర్చూరు సర్కిల్ పరిధిలోని యద్దనపూడి మండలంలో పూనూరు, యద్దనపూడి, పోలూరు, జాగర్లమూడి, చింతపల్లిపాడు, సూరవరపుపల్లి గ్రామాల్లో పర్చూరు మండలంలో పర్చూరులోని ఇందిరా కాలనీ, నెహ్రూకాలనీ, ఉప్పుటూరు, బోదవాడ, వీరన్నపాలెం, చెరుకూరు, తదితర గ్రామాల్లో పేకాట జోరుగా నడుస్తోంది. మార్టూరు మండలంలో 8 నెలల క్రితం జొన్నతాళిలో పేకాడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకొని సుమారు రూ.1 లక్ష నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 8వ తేదీ మార్టూరులోని కొణిదెన రోడ్డులో ఓ బిల్డింగ్‌లో పేకాడుతున్న ఆరుగురుని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 3.69 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు

సరిహద్దు ప్రదేశాలే అడ్డాగా..

జూదరులు పోలీసుల కళ్లుగప్పేందుకు రెండు మండలాల సరిహద్దులు, జిల్లా సరిహద్దులు, చెట్ల పొదలు, వాగులవెంబడి, చెరువుకట్టలపై పేకాట అడ్డాగా వినియోగిస్తున్నారు. మండలాల, జిల్లా సరిహద్దులైతే అక్కడి పోలీసులు తమ పరిధి కాదన్నట్లు ఉంటారనే ధైర్యం దీనికి తోడూ వాహనాలు వెళ్లలేని ప్రదేశాలను జూదం ఆడేందుకు అడ్డాగా వినియోగించుకుంటున్నారు. ఆడేవారికి మినహా ఇతరులకు ఏమాత్రం సమాచారం లేకుండా ఔత్సాహిక సభ్యులు ఓ బృందంగా ఏర్పడి తాము నిర్ణయించుకున్న స్థలానికి చేరుకొని పేకాడుతున్నారు. ఒక వేళ పోలీసులకు సమాచారం తెలిసినా శివారు ప్రాంతాలు కావటంతో పోలీసులు కాలినడకన వెళ్లేందుకు ఇష్టపడక వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ విచిత్రం ఏంటంటే పోలీసులు పట్టుకున్నా నగదులో తేడాలు కనిపిస్తున్నాయి. పట్టుకున్నప్పుడు నగదు ఒక లెక్క, బయటికి చెప్పేటప్పుడు మరో నగదును పోలీసులు చూపిస్తున్నారని ఆరోపణలు.

వడ్డీ వ్యాపారుల కనుసన్నల్లో..

పేకాటలో డబ్బులు పోగొట్టుకున్న వారు కొందరు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఈ వడ్డీ వ్యాపారులు ద్విచక్ర వాహనాలను, బంగారు, వెండీ, ఇంటి స్థలాలు వంటివి కుదవ పెట్టుకోవటమే కాకుండా ఖాళీ ప్రాంసరీ నోటుపై సంతకాలు పెట్టించుకుంటున్నారు. కొందరు వ్యాపారులైతే పేకాట శిబిరం వద్దే వారం, రోజులు, గంటలు వంతున కూడా వడ్డీకి ఇస్తున్నారు. ఇలా అప్పులు తీసుకున్న వారు ఎంతో మంది ఇప్పటికే రోడ్డున పడ్డారు.

పేకాట స్థావరాలపై తగ్గుతున్న దాడులు..

పర్చూరు సర్కిల్ పరిధిలోని యద్దనపూడి మండలంలో 2022లో చిమటవారిపాలెం, యనమదల, సూరవరపుపల్లి గ్రామాల్లో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి రూ.10,700 వరకు నగదును స్వాధీనం చేసుకున్నారు. పర్చూరు మండలంలో 2023లో 4 కేసులు, 2024లో రెండు కేసులు మాత్రమే నమోదయ్యాయి. పోలీసులు నమోదన కేసులు మాత్రం ఒకటి రెండు.. ఇలా. కాని నమోదు కాని లెక్కలెన్నో అని ప్రజలు బహిరంగంగా మాట్లాడుకుంటున్నారు.

> **జూదాలపై ఉక్కు పాదం..**
>
> 
>
> జూదాలపై ఉక్కుపాదం మోపుతాం. పేకాట ఆడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. పేకాట శిబిరాలపై నిరంతర నిఘా ఉంచుతాం. ప్రజలు కూడా జూదాల నిర్వహణపై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలి. సమాచారం అందించిన వారి వివరాలు, వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం.
>
> – జీఎల్ శ్రీనివాసరావు, పర్చూరు సీఐ

వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం



వేటపాలెంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



చీరాల: మెగా వైద్య శిబిరానికి హాజరైన భారీ ఎత్తున ప్రజలు

వేటపాలెం: వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. స్థానిక బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాలలో రోటరీ క్లబ్, 1992 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కంటి శిబిరాన్ని ఎస్సై ఎం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రోటరీ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కంటి వైద్యులు ఆరాటిరి, యోగితా 121 మంది వైద్య పరీక్షలు నిర్వహించారు. 27 మందికి కంటి శస్త్రచికిత్సల నిమిత్తం సిఫార్సు చేశారు. మరో పది మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఏవీ సురేష్‌బాబు, కార్యదర్శి లక్ష్మణస్వామి, గొల్లపూడి సీతారాం, మాజీ అధ్యక్షుడు మోహన్‌రావు, శ్రీనివాసరావు, నాగేంద్రరావు, రవికుమార్, శివరామకృష్ణ, పద్మనాభ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో..

చీరాల అర్బన్: సత్యసాయి సేవా సమితి చీరాల ఆధ్వర్యంలో పిట్టలవానిపాలెం కేర్ హాస్పిటల్ వారి ఆయుర్వేద, న్యాచురోపతి, హోమియోపతి వైద్య శిబిరాన్ని చీరాలలో నిర్వహించారు. శిబిరంలో 260 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందించి వైద్య సూచనలు చేశారు. సత్యసాయి భజన మండలి, కొట్లబజారులో ఏషియన్ హాస్పిటల్ హైదరాబాద్ వెరికోస్ వైన్స్ రక్తనాళాల వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 70 మందికి తగు పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. వీరిలో 40 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు.

సమాజ సేవా కార్యక్రమాలకే రామానంద ట్రస్ట్ ప్రాధాన్యం..

చీరాల టౌన్: సమాజ సేవ, ఆధ్యాత్మిక, ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి ప్రతి ఒక్కరికి సేవ చేయడమే శ్రీరామానంద సరస్వతి ట్రస్ట్ లక్ష్యమని ఆశ్రమ మేనేజర్ నారాయణం సురేష్ తెలిపారు. ఆదివారం మండలంలోని వాడరేవు గ్రామంలోని రామానంద సరస్వతి ఆశ్రమంలో నిర్వహించిన ఉచిత మెగా షుగరు వ్యాధి శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రకాశం, బాపట్ల, గుంటూరు జిల్లాలకు చెందిన 1137 మంది ఉచిత షుగరు వైద్య శిబిరానికి హాజరు కాగా వీరికి డాక్టర్ రాజరాజేశ్వరి, డాక్టర్ పేట శ్రీకాంత్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ లలిత ప్రకాష్‌లు వైద్య పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అలానే సిబార్ దంత వైద్యకళాశాల బృందం సహకారంతో దంత, నోటి సంబంధించిన వ్యాధులకు పరీక్షలు చేశారు. నోటి క్యాన్సర్ నిర్ధారణ అయిన వారికి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య సేవలు, మందులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షుడు కృష్ణారావు, శంకరరావు, సురేష్, బసవరావు, శ్రీనివాస్, కామేశ్వరరావు, గోపాల్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరానికి 652 మంది హాజరు..

పర్చూరు (చినగంజాం): ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రి గ్రూప్స్ ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి సహకారంతో పర్చూరు వైఆర్ హైస్కూల్‌లో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యశిబిరాన్ని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రారంభించారు. శిబిరంలో మొత్తం 652 మంది హాజరు కాగా 315 మందిని శస్త్ర చికిత్సకు వైద్యులు సూచించారు. ముందుగా ఎన్టీఆర్, ఏలూరి నాగేశ్వరరావులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.



పర్చూరులో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి



చీరాలలో వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

స్కూల్ గేమ్స్‌లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

చీరాల టౌన్: ఏపీ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో చీరాల భాష్యం హైస్కూల్ విద్యార్థులు పతకాల పంట పండించారు. మండలంలోని జాండ్రపేట బీవీ అండ్ బీఎస్ హైస్కూల్లో మూడు రోజుల పాటు ఆటల పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో భాష్యం విద్యార్థులు సీనియర్, జూనియర్స్ విభాగంలో పతకాలు సాధించడం గర్వకారణమని ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు, హెచ్‌ఎం. పి.శిరీషాలు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను ఆదివారం స్కూల్ ఆవరణలో అభినందించారు. విద్యార్థులకు ఆటల్లో మంచి తర్ఫీదును అందించిన పీడీ వంశీ, పీఈటీ హితేష్, కరాటే మాస్టార్ వీ.సుబ్బారావులను ప్రత్యేకంగా అభినందించారు. కబడ్డీ, రన్నింగ్, షటిల్, షాట్‌పుట్, చెస్, యోగా పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను మెమొంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన ఉండాలి



రోప్ ద్వారా ప్రజలను తరలించడాన్ని వివరిస్తున్న శిక్షకులు

చీరాల అర్బన్: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఏ విధంగా సహాయం చేయడంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక చైతన్య భారతి డిగ్రీ కాలేజీలో నిర్వహించారు. శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు మనం మన చుట్టు పక్కల వారికి, సమాజానికి ఏ విధంగా సహాయపడాలి, అందుబాటులో ఉన్న వస్తువులు, పరికరాలు ఉపయోగించి ఏ విధంగా కాపాడాలి, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఏ విధంగా నివారణ చర్యలు తీసుకోవాలనేది ప్రయోగాత్మకంగా వివరించారు. అలానే ప్రథమ చికిత్సలో భాగంగా గుండెకి సంబంధించిన ఇబ్బందులు వచ్చిన సమయంలో ప్రాణాపాయ పరిస్థితుల్లో సీపీఆర్ పద్ధతి ఏ విధంగా అందించాలనేది సత్యసాయి సేవా సంస్థల డిజాస్టర్స్ మేనేజ్‌మెంట్ రాష్ట్ర ఇన్‌చార్జి బండి సురేష్ వివరించారు. కార్యక్రమంలో సంస్థల జిల్లా అధ్యక్షుడు ముంగర రాంబాబు, 110 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సేవల కో–ఆర్డినేటర్ గోవర్ధన్, జిల్లా, గ్రామ సేవల ఇన్‌చార్జి శ్రీనివాసరావు, జిల్లా మెడికల్ జాయింట్ ఇన్‌చార్జి అమర రాంబాబు, ప్రిన్సిపాల్ సోమేశ్వరరావు, సభ్యులు కృష్ణ, పున్నారావు, రామచంద్రరావు, వైద్యబృందం పాల్గొన్నారు.

పీఈటీ సుందరరామిరెడ్డి చేసిన సేవలు ఎనలేనివి



సుందరరామిరెడ్డి దంపతులను సత్కరిస్తున్న అతిథులు

చీరాల అర్బన్: హాకీ క్రీడకు వ్యాయామ ఉపాధ్యాయులు ఆళ్ల సుందరరామిరెడ్డి చేసిన సేవలు ఎనలేనివని ఆంధ్రప్రదేశ్ హాకీ ఫెడరేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎం.నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పేరాలలోని గోలి సదాశివరావు కళ్యాణ మండపంలో ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు ఆళ్ల సుందరరామిరెడ్డి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పూర్వపు ప్రకాశం జిల్లాలో హాకీ క్రీడలో జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారు చేసిన ఘనత సుందరరామిరెడ్డికే దక్కిందన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు వై.శీనయ్య మాట్లాడుతూ వేసవి హాకీ శిక్షణా శిబిరాలు నిర్వహించారన్నారు. అనంతరం సుందరరామిరెడ్డి దంపతులను వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ప్రతినిధులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆయన శిష్యులు కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండీ తాడివలస దేవరాజు, ప్రకాష్, ధన, గోల్డి, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, కృష్ణమోహన్, కుర్రా రామారావు, వెలుగొండ రెడ్డి, వీరాంజనేయులు, ఏడుకొండలు, పవని భానుచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి



వలస కార్మికులకు అవగాహన కల్పిస్తున్న సాగర్, తదితరులు

మార్టూరు: రాష్ట్రాలు జిల్లాలు దాటి బతుకుదెరువు కోసం వచ్చిన వలస కార్మికులు మత్తు మాదకద్రవ్యాలు తదితర దురాలవాట్లను దరిచేరనీయ వద్దని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీవీ సాగర్ అన్నారు. బాపట్ల జిల్లా హెచ్‌ఐవీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో మార్టూరులోని మారుతీ కాటన్ స్పిన్నింగ్ మిల్లులో వలస కార్మికులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాలను సేవిస్తున్న యువత విచ్చలవిడి శృంగారానికి అలవాటు పడి ఎయిడ్స్ మహమ్మారి లాంటి ప్రాణాంతక వ్యాధులకు గురై తమ విలువైన జీవితాలతో పాటు తమ కుటుంబాలు ఛిన్నాభిన్నం కావడానికి కారకులవుతున్నారన్నారు. కార్మికులు హెచ్‌ఐవీ బారిన పడకుండా ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలు మాత్రమే కాకుండా ఆయా సంస్థల యాజమాన్యాలు కూడా బాధ్యత తీసుకొని అవగాహన కల్పించాలని సాగర్ అన్నారు. కార్యక్రమంలో స్పిన్నింగ్ మిల్ మేనేజర్ పి వెంకటరత్నం, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కే దుర్గ, రూతు, సల్మా, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు తరలివెళ్లిన దళిత సంఘాల నాయకులు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి ఒంగోలు తరలివెళ్తున్న దళిత సంఘాల నాయకులు

చీరాల రూరల్: ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ ఒంగోలులో తలపెట్టిన చలో ఒంగోలు బహిరంగ సభకు చీరాలకు చెందిన దళిత సంఘాల నాయకులు ఆదివారం సాయంత్రం అధిక సంఖ్యలో వాహనాల్లో తరలివెళ్లారు. ముందుగా రైల్వే స్టేషన్ ఎదురుగా గల ముక్కోణం పార్కు సెంటర్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాచవరపు జూలియన్, పులిపాటి బాబురావు, మల్లెల వెంకట్రావు, కాటి మార్కు, దేవరపల్లి బాబురావు, మల్లెల బుల్లిబాబులు మాట్లాడారు. కాలం చెల్లిన ఎస్సీ రిజర్వేషన్ల ప్రక్రియను బీజేపీ కావాలనే కుట్రపూరితంగా వ్యవహరిస్తూ మందకృష్ణ వర్గానికి అనుకూలంగా సుప్రీం కోర్టుతో తీర్పులు చెప్పించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఆర్టికల్ 341 ప్రకారం గతంలో ఇదే సుప్రీం కోర్టు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చెల్లదని కొట్టివేస్తూ తీర్పులు వెలువరించిన విషయాన్ని వారు గుర్తు చేశారు. ఎస్సీ రిజర్వేషన్లను కాల క్రమేణా పూర్తిగా ఎత్తివేయడానికి బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని వారు ఆరోపించారు. కార్యక్రమంలో కోండ్రు కిరణ్, సంగుల చిరంజీవి, కట్టా సాల్మన్, సల్లూరి అనిల్, బొనిగల పేతురుబాబు, కనపర్తి బజ్జిబాబు, గొర్రెముచ్చు, గోసాల అశోక్, చప్పిడి ప్రియతమ్‌తో పాటు పట్టణంలోని అన్ని దళిత వాడల నుంచి అధిక సంఖ్యలో నాయకులు తరలివెళ్లారు.

ఆడపిల్లలు పుట్టడం దేవుడు ఇచ్చిన వరం



కుమార్తెల దినోత్సవాన్ని నిర్వహిస్తున్న రాంబాబు

చీరాల: ఆడపిల్లలు పుట్టడం దేవుడు ఇచ్చిన వరమని.. వారు కుటుంబంలోని తల్లిదండ్రులపై చూపించే ప్రేమ ఎనలేనిదని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ చైర్ పరిశోధకుడు తేళ్ల రాంబాబు అన్నారు. కుమార్తెల దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక విజయనగర్‌కాలనీలో ఆడపిల్లలతో కలిసి కుమార్తెల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆడపిల్లలు తల్లిదండ్రులపై, అన్నదమ్ములపై, ఉపాధ్యాయుల పట్ల ఎంతో ప్రేమ చూపించి సమాజానికి ఆదర్శంగా నిలుస్తారన్నారు. ఆడపిల్లలను స్ఫూర్తిగా తీసుకొని భగవంతుడు ఇచ్చిన వరంగా వారిని ప్రేమించడం తల్లిదండ్రుల వరం అని అన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం భాద్రపద మాసం, కృత్తిక నక్షత్రం, షష్టి తిధి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్

గుర్తుతెలియని మహిళకు గాయాలు

చినగంజాం: జాతీయ రహదారిపై అడివీధిపాలెం వద్ద ఆదివారం వేకువజామున గుర్తు తెలియని మహిళను ఆటో ఢీకొట్టింది. పోలీసుల వివరాల మేరకు.. గుర్తు తెలియని మహిళ రోడ్డు దాటి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్పందించిన హైవే పోలీసులు హైవే అంబులెన్స్ ద్వారా చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆమె ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఆమె పరిస్థితి మెరుగుపడినట్లు చినగంజాం ఎస్ఐ ఎస్ రమేష్ తెలిపారు.

ఎరువుల దుకాణాలపై ఏవో దాడులు



కేవీ పాలెంలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏవో

బల్లికురవ: మండలంలోని కొమ్మినేనివారిపాలెం, కొప్పరపాడు, గొర్రెపాడు, కూకట్లపల్లి గ్రామాల్లోని ఎరువుల దుకాణలను ఆదివారం మండల వ్యవసాయాధికారి ఎస్‌వీపీ కుమారి తనికీలు నిర్వహించారు. ఎరువులు దుకాణాల రికార్డులను, నిల్వలను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు అకోనుగోలు చేయగానే విధిగా బిల్లులు తీసుకోవాలని రైతులకు సూచించారు. డీఏపీ రూ.1350, యూరియా రూ.266 మించి అమ్మరాదన్నారు. అధిక ధరలకు అమ్మితే తక్షణమే ఫిర్యాదు చేయాలని రైతులకు తెలిపారు.